క్లుప్తంగా

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని మార్పు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు తులసి పద్మశ్రీ కళా సంస్థలకు సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం వరద బాధితులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంగీత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సేవే పరమావధిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాల వారికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, సిటీ సబ్‌స్టేషన్ 11కేవీ నక్కల రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డు ఘోరీలదొడ్డి ఏరియా, విజయా టాకీస్ ఏరియా, నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావునాయుడు వీధి, కాశేశ్వరరావు రోడ్, వెంకటరత్నం వీధి, గోపరాజు రామచంద్రరావు వీధి, తాడేపల్లివారి వీధి, పీసపాటివారి వీధి, డోర్నకల్ రోడ్డు ఎం జోకేర్ హాస్పిటల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేవీ రెడ్డి సినీరంగ సేవలు ఆదర్శం



విజయవాడ కల్చరల్: నిర్మాత, దర్శకుడు కేవీ రెడ్డి(కదిరి వెంకటరెడ్డి) సినీరంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద కేవీ రెడ్డి 50 వర్ధంతి, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమాలను స్వర్ణయుగం వైపు మళ్లించిన దర్శకుడు కేవీ రెడ్డి అన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు సింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో క్లాసిక్‌గా భావించే మాయాబజార్ చిత్రం విడుదలై 67 సంవత్సరాలైనా నేటికి ప్రేక్షకులు ఆదర్శిస్తూనే ఉన్నారన్నారు. వివిధ రంగాలకు చెందిన కే డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, గోళ్ల నారాయణరావు, బీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

చోరీ ఘటనపై కేసు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చోరీ జరిగిందంటూ సోమవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు.. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డుకు చెందిన పగిడాల నాగలక్ష్మి, దాలినాయుడు దంపతులు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి 11 గంటలకు ఇంటి తలుపులు దగ్గరగా వేసుకుని కుటుంబసభ్యులు నిద్రపోయారు. తెల్లవారుజామున మూడు గంటలకు మెలకువ వచ్చి చూడగా ఇంటిలోని బీరువా తలుపులు తెరచి ఉండటంతో పాటు సామాన్లు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 14తులాల వెండి పట్టీలు రెండు జతలు, గోల్డ్ చైన్, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 5 వేలు నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితుల సహనాన్ని పరీక్షించొద్దు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు బాధితులకు ఆర్థిక సాయం అందించడంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. బాధితులు సర్వం కోల్పోయారని, ప్రభుత్వం బాధితుల సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు. సోమవారం కండ్రికలో ఆయన పర్యటించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌నగర్ (కండ్రికకాలనీ)లో భోజన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీపై ఆధారపడిన కేంద్ర ప్రభుత్వంపై చంద్రబాబు ఒత్తిడి చేయడంలో విఫలమయ్యారన్నారు. తక్షణమే ఆర్థిక సాయం అందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులే ఆహార పంపిణీ నిలిపివేయాలని కోరినట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పడం శోచనీయమన్నారు. బాధితులపై నింద వేయడం సరికాదన్నారు. గత 12 రోజులుగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 1,20,000 మందికి భోజనం అందించామని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు కే దుర్గారావు, ఏ వెంకటేశ్వరరావు, ఝాన్సీ, పీర్ సాహెబ్, వెంకటరెడ్డి, పిచ్చమ్మ, సావిత్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద.. తీరని వ్యథ

బుడమేరుకు వచ్చిన వరద నగర వాసులకు తీరని వ్యథను మిగిల్చింది. వరద వచ్చి 16 రోజులు గడిచినా బాధితుల కష్టాలు తీరడం లేదు. ఇళ్లలోని సామగ్రి పూర్తి పాడైపోవడంతో వాటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



జక్కంపూడి కాలనీలో పుస్తకాలను ఆరబెడుతున్న చిన్నారి



సింగ్‌నగర్ ఎంకే బేగ్ హైస్కూల్‌లో తడిసిన పుస్తకాలు



న్యూ రాజరాజేశ్వరిపేటలో తడిసిన పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న చిన్నారులు



రామరాజ్యనగర్‌లో డాక్యుమెంట్లను ఆరబెట్టిన మహిళ



సింగ్‌నగర్‌లోని ఓ షోరూమ్ వద్ద చేర్చిన ముంపునకు గురైన వాహనాలు



రామరాజ్యనగర్‌లో ఓ ఇంట్లో పాడైపోయిన సామగ్రి

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించండి



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే పారిశుద్ధ్య నిర్వహణ పూర్తి చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, నున్న, ముస్తాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నుంచి వచ్చిన వ్యర్థాలను తొలగించకపోవటం, రోడ్ల వెంబడి ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలు ఉండటం చూసి స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మందలించారు. దగ్గరుండి వ్యర్థాలను తీసేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరావుకు సూచించారు. అనంతరం ఆయన రాజీవ్ గాంధీ స్కూల్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలించారు. స్కూల్‌లో చేయాల్సిన పారిశుద్ధ్య నిర్వహణ సత్వరమే పూర్తి చేసి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు నెమ్మదిగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాటువేయడానికి పడగ విప్పుతున్నాడన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. సీబీఎస్ఈ సిలబస్ ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. ముఖ్యంగా పేద పిల్లల తల్లిదండ్రులు సీబీఎస్ఈ కొనసాగించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలేనన్నారు. వారికి విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తోందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ యథావిధిగా కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

రోడ్లపైనే వ్యర్థాలు



రాజీవ్‌నగర్‌లో రోడ్లపై ఉన్న వ్యర్థాలు

పాయకాపురం(విజయవాడరూరల్): వరదల్లో మునిగిన ఇళ్లల్లో పాడైన గృహోపకరణాలు రాజీవ్‌నగర్ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి. వరదలు తగ్గి బురదల్లో ఉన్న ఇళ్లను శుభ్రం చేసుకొనేందుకు పనికిరాని వస్తువులను, గృహోపకరణాల వ్యర్థాలను శానిటేషన్ సిబ్బంది రోజుల తరబడి నిల్వ ఉంచుతున్నారని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండటమేకాక వాటి నుంచి దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ వెంటనే ఆ ప్రాంతానికి వచ్చి రోడ్లపై కుప్పలు తెప్పలుగా ఉన్న వ్యర్థాలు పరిశీలించి శానిటేషన్ అధికారులపై మండిపడ్డారు. వెంటనే వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులతో కమిషనర్ తాగునీటి సరఫరా గురించి మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని సూచించారు.

నేటి స్వచ్ఛతాహి సేవలో అందరూ పాల్గొనాలి

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొనాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర నగర పౌరులకు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం జరిగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభోత్సవానికి కావలసిన ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయంగా స్వచ్ఛభారత్ మిషన్‌గా 2014 లో మొదలైన స్వచ్ఛభారత్ – 2024కు 10 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో అందరూ పాల్గొని, స్వచ్ఛ విజయవాడలో భాగస్వాములు కావాలని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమం మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి. సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్ పాల్గొన్నారు.

ఉచిత ఎల్ఈడీ సర్వీస్ క్యాంప్



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులు బిగ్‌టీవీ సొల్యూషన్స్ ఫ్లడ్ రిలీఫ్–2024 ఉచిత ఎల్ఈడీ టీవీ సర్వీస్ క్యాంప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్, అల్లూరి సీతారామరాజు రోడ్డులోని బిగ్‌టీవీ సొల్యూషన్స్ కార్యాలయంలో సోమవారం ఉచిత ఎల్ఈడీ టీవీ సర్వీస్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా మాట్లాడుతూ వరదలతో పాడైన టీవీలకు మరమ్మతులు చేసేందుకు బిగ్‌టీవీ సొల్యూషన్స్ వారు ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. బిగ్‌టీవీ సొల్యూషన్స్ నిర్వాహకుడు కొల్లి సీతారామ్ మాట్లాడుతూ ఉచిత సేవలు ఈనెల 25వ తేదీ వరకు అందిస్తున్నట్లు తెలిపారు. రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో రీజనల్ ప్రెసిడెంట్ బేతు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లో సోమవారం విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశారు. ఇటీవల బుడమేరు వరద ప్రభావంతో నీట మునిగిన ప్రాంతాల్లో మరమ్మతులు చేస్తున్నట్లు ఏఈ శివారెడ్డి తెలిపారు.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు



రామానాయుడు వీధిలోని లడ్డూ వేలంలో గొర్తి శ్రీనివాస చక్రవర్తి, కాంతారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సూర్యారావుపేట రామానాయుడువీధిలో విక్రాంత్ పబ్లిషర్స్ ఆధ్వర్యాన నిర్వహించిన వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల చివరి రోజు సోమవారం అన్నదాన కార్యక్రమంతోపాటు లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి వేడుకలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల చివరిరోజున నిర్వహించే గణనాథుని ఊరేగింపునకు విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. వేలంలో వ్యాపారవేత్త రూ. 10 వేలకు లడ్డూను దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గొర్తి లత, పద్మప్రియ, వీరాచారి, గణేష్, గోపాల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలు ఆదర్శంగా తీసుకోవాలి



పురస్కారాలు అందుకున్న చిన్నారులతో వేముల హజరత్తయ్యగుప్తా, నాట్యాచార్యుడు శ్రీనివాసరావు

విజయవాడ కల్చరల్: భారతీయ సంప్రదాయ నృత్యరీతులను ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. నటరాజ నృత్య కళామందిర్ కర్నూలు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కూచిపూడి, ఆంధ్రనాట్యం ప్రదర్శనలు, ప్రతిభ కనపరచిన చిన్నారులకు నృత్య కిశోరం పురస్కారాల కార్యక్రమాన్ని సోమవారం బందరు రోడ్డులోని ఏబీవీ జ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన గుప్తా మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం అంశాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. నాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలబాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రముఖ నాట్యాచారిణి పసుమర్తి శ్రీవల్లి మాట్లాడుతూ నృత్యసాధన భగవంతుని సేవలా భావించాలని కోరారు. నగరానికి చెందిన నాట్యాచార్యులు సంతోష్, శోభ అన్నంభొట్ల, యం. ప్రణతి ప్రసంగించారు. నాట్యాచార్యుడు కరీముల్లా ఆధ్వర్యంలో 150 మంది చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన 22 మంది కళాకారులకు నృత్య కిశోరం పురస్కారాలను, చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. నృత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరద బాధితులకు ఎన్నారై ఆత్మీయ గ్రూప్ సభ్యుడు రమేష్ రామ్‌శెట్టి ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాయకాపురం, శాంతినగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్‌లోని బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఎన్నారై ఆత్మీయ గ్రూప్ సభ్యుల సహకారంతో నిత్యావసరాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు విజయ్‌రామ్‌శెట్టి, పసుపులేటి వంశీ, రాకేష్, ఓం నక్క, సత్య వెజ్, నాని చేగొండి, బోనం గణేష్, దీపిక, లక్ష్మణ్, తోట భాస్కర్, స్వాతి, సుగుణ, ప్రశాంత, చందు, బల్లం కిషోర్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వీఆర్ఏ వెల్ఫేర్ సంఘం సభ్యులు

విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సాయం

వరదల్లో నష్టపోయిన విశ్వబ్రాహ్మణులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి అన్నారు. సోమవారం రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ముంపునకు గురైన 180 విశ్వబ్రాహ్మణుల కుటుంబాలకు కాకినాడ, పార్వతీపురానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సేకరించిన రూ. 1.80 లక్షలను కుటుంబానికి వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం, కార్యదర్శి కొమ్మోజు సత్యనారాయణ, రమణ, పార్వతీపురం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెరుకూరి ఈశ్వరరావు, మజ్జి శంకర్రావు, గడ్డం విజయరాజు, బోరగాని రంగ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం రజక చైతన్య సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం ఆ సంస్థ ఆధ్వర్యాన సుమారు 1,500 మంది రజక వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధిత రజకులకు నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయం అని కొనియాడారు. రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు మాట్లాడుతూ తాము వరద బాధిత ప్రాంతాల్లోని రజకులకు సుమారు రెండు లక్షల విలువైన నిత్యావసరాలు అందజేస్తున్నామని తెలిపారు. సంస్థ సభ్యులు భవిరి సింహాచలం, సతివాడ రాము, మురళి, వాల్తేరు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ముత్యాలంపాడు గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అనంతలక్ష్మీదేవి సేవాసంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు, సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు తదితరులు బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నిరుద్యోగ జేఏసీ నేత సాయం

సాక్షి, అమరావతి: విజయవాడ వరద బాధితులకు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తన కుటుంబ సభ్యుల సహకారంతో సాయం అందించారు. సోమవారం సింగ్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతతో కలిసి వరద బాధితులకు దుస్తులు, బూట్లు, మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్, బక్కెట్లు, మగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేషనల్ నరేంద్ర మోదీ విచార్ మంచ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి పిల్లై జి, పగలవంజి, కరుణామూర్తి, పురుషోత్తం, రాజేంద్రన్, గోంప ప్రకాష్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు



రజకులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ వెల్ఫేర్ సర్వీస్ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి, యార్డ్ రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్ కాలనీ, వాటర్ ట్యాంక్ కాలనీలో బాధితులకు 12 రకాల నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. సంఘ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బాధితులను ఆదుకోవడంలో తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందని వెల్లడించారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆది, సోమవారం పర్యటించి బాధితులకు సరుకులు, దుప్పట్లు, దుస్తులు అందజేశామని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, ప్రధాన కార్యదర్శి కొమ్మిది ఈశ్వరయ్య, కార్యదర్శి కోడూరు పుల్లయ్య, ఉపాధ్యక్షుడు బొట్ల నాగసుబ్బయ్య యాదవ్, షేక్ బాషా, బాణాల శ్రీనివాసులు, గుర్రాల హరికృష్ణ రాయల్, లక్ష్మీనరసయ్య, రమాదేవి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడపాలని, వారంలో ఒక రోజు డ్రై–డేని అమలు చేయాలని మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి, పి.దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం రాష్ట్రంలో అమలు కానున్న నూతన మద్యం పాలసీ విధానంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం పాలసీలపై అధ్యయనం చేసిన బృందాల నివేదికను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, ప్రముఖుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అక్రమ విక్రయాలు సాగుతున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. మద్యం పాలసీ నియంత్రణ దిశగా, నేరాలు అరికట్టే విధంగా, ప్రభుత్వమే విక్రయాలు, షాపులు తగ్గించడం లక్ష్యంగా విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గుడి, బడి, బస్టాండ్‌లు తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న దుకాణాలను రద్దుచేయాలని కోరారు. బెల్ట్ షాపుల అమ్మకాలు నిరోధించాలని, ప్రతి పీహెచ్‌సీలో డీ ఎడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, అధికార యంత్రాంగాన్ని, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను మద్య నియంత్రణ లక్ష్యంగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు సుంకర పద్మశ్రీ, పి.పద్మ, ఎన్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

• వాహనచోదకులకు తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావం తగ్గినప్పటికీ వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. వరద నీటిలో మునిగిన ద్విచక్రవాహనాలు స్టార్ట్ కావడం లేదు. వరదతో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పుడు ద్విచక్ర వాహనాల మరమ్మతులకు రూ. 2వేలు నుంచి రూ. 5వేలకు పైగా ఖర్చవుతోందని వాపోతున్నారు.